# మా బావ!

కర్రా రాజారామమోహన్‌రాయ్

●

కొంతం పోరుపడలేక ఆఖరుకి ఏజన్సీలో యున్న బావను మావూరు తీసుకొచ్చాను. ఏజన్సీ వెళ్లాక మా బావ పూర్తిగా మారి పోయాడు. ఆ రూపు, మెళ్లో పూసలూ, ఆ నల్లటి మూడుమూరల గావంచా, ఆ నున్నటి గుండు చూస్తే, కొండమనిషిలా కనుపిం చాడు. ఎక్కువకాలం ఆ ఏజన్సీలో యుండ టంవలన మాతృభాషయైన తెలుగు మరిచి కోయభాష అభ్యాసమయింది. ఈ భాషకు తోడు నత్తికూడ అబ్బింది బావకు. ఒక్కొ క్క మాట పలుకుటకు పదేసి నిముషములు తీసుకొనేవాడు. మొదటలో బావ మాటలు వింటూయుంటే నవ్వు వచ్చేది. నేను నవ్వు తూయుంటే కాంతము భరించలేకపోయేది. మొత్తంమీద బావ మాటలు మాకు అల వాటయిపోయాయి. నా పోరుపడలేక బావ నాతో తరచు మాటలాడేవాడుకాదు. కాం తము బావకి బజారు పనులు పురమాయిం చేది. బావకూడా కాంతానికి తోడునీడగా యుండేవాడు. బావ వీధిలోకి వెళ్లేడంటే ఒక పితూరీ తెచ్చాడన్న మాటే! అలాంటి వాడు మా మేనబావ!

నేను బావకు కొన్ని సూత్రాలు చె ప్పాను. రోజూ కొన్ని కొన్ని విషయాలు బోధించే వాడిని. అలా తర్ఫీదుచేశాను బా వను. మా సంసార బాధ్యతఅంతా బావ మీద పడేశాను. యింట్లో లేనివస్తువులు కాంతం చెప్పడం—నేను డబ్బు యివ్వడం —బావ బజారునుండి తేవడం—అలవా టయింది. బావలో కొంతమార్పు వచ్చింది.

వారంరోజులుబట్టీ వార్నింగు యిస్తు న్నాది కాంతం, యింట్లో పప్పులు లేవని. విసుగెత్తి రెండు విచ్చరూపాయలు బావకు యిచ్చి పప్పులు తెమ్మన్నా. రెండు రూపా యలు రెండు పిడికిటిలలోనూ గట్టిగా పట్టు కొని బయలుదేరాడు బజారుకు. దారిలో ఒక చిన్న యేరు దాటవలసివచ్చింది. రెండు రూపాయలూ బొడ్డుకొంగున ముడివేసి పంచ మీదకు కట్టి యేరుదాటాడు. తిరిగి ముడి యిప్పి రెండురూపాయలు చేతులో పట్టుకొని కొంచమునేపు ఆలోచించి ఆఖరుకి తిరుగు ముఖంపెట్టాడు. "పప్పులులేకుండా వచ్చేశా వేం బావా" అని అడిగాను. "రూపాయలు రెండూ కలిసిపోయాయి—ఏ రూపాయి పెట్టి పెసరపప్పు తెమ్మన్నావో—ఏ రూపాయి పెట్టి కందిపప్పు తెమ్మన్నావో మరచిపో యాను దయచేసి మళ్లాచెప్పు" అని అతి దీనంగా అడిగాడు బావ. బావ అమాయ కత్వానికి విచారించి రెండు రూపాయలూ యిచ్చి రెండు పప్పులూ తెమ్మన్నాను.

యిటువంటి తెలివితక్కువ బావకు ఎక్కడయినా నౌకరీ చూడమంది కాంతం. బావకు సరియైన ఉద్యోగం ఏమిటా అని

ఆలోచించా. యింతటిలో ఆ కంపెనీలో ఒక డిస్పేచరు వుద్యోగం ఖాళీవచ్చింది. బావకు యింటిదగ్గర రోజూ యింగ్లీషు చెప్తూ చూచి వ్రాత వ్రాయిస్తూ యుండే వాన్ని. దానివలన బావదస్తూరి బాగుండేది. డిస్పేచరు ఉద్యోగానికి ఎక్కువ చదువు అక్కర్లేదు కాబట్టి మాదొరతో చెప్పి బావకు ఆ నౌకరీ యిప్పించా. యీ విధంగా కొన్ని నెలలు గడిచాయి.

పనితొందరలో ఒక రోజున తప్పు ఎడ్రసు వ్రాసి ఒక వుత్తరము పెద్దదొరకు పంపించాడు బావ. ఆ తప్పుకి దొరగారు ఖారాలు మిరియాలు నూరుచున్నాడు. పాపం! ఆ పెద్దదొరకి బావలాగే నత్తియుండేది. దొరగారు బావకు కబురుచేసి "యియియిల్లాంటి తతతప్పులు నేను క్షమించను. నీనీనీనీవుగాని కేకేరుఫుల్‌గా ల్లేల్లేల్లేకపోతే జాజాజాగ్రత్త" అని గ్రుడ్లు ఎర్రచేశాడు ఆ పెద్దదొర.

"హాహాహారపాటు, సర్, క్షక్షక్షమించాలి" అని బావ అనేసరికి, దొరగారు బావ మాటలు యింకోవిధంగా అర్థంచేసుకొని, తనని నిందించేడని నేరముమీద వెంటనే డిస్మిస్ ఆర్డర్లు వేశాడు.

కాంతం, నేను బావ పనులుచెప్పుకుని నవ్వుకుంటూయున్న సమయంలో దిగాలా ముఖం వేసుకుని యింటికొచ్చాడు. బావకు నౌకరీ లాభంలేదని యింట్లోనేయుంచుకొని తిండి పెట్టేవాళ్లం.

ఒక రోజు కాంతం పెరట్లో మిరపకాయలు ఎండబోసి బావని అక్కడ కాపలా కూర్చోమన్నది. చాలాసేపు బావ కాపలా కూర్చున్నాడు. కొంతసేపటికి కొన్ని కాకులు మిరపకాయలు తీసుకుపోతున్నాయి. బావ చూస్తూ వూరుకున్నాడు. "కాకులు మిరపకాయలు ఎత్తుకుపోతూయుంటే చూస్తూ వూరుకుంటావేం" అంది కాంతం కోపంతో. "అయితే కాకులని తోలమన్నావా" అని అడిగాడు అమాయకంగా. అవునన్నట్లు కాంతం బుర్ర వూపింది.

కర్రపట్టుకుని చాలా సీరియస్‌గ కూర్చున్నాడు బావ. యింతలో కొన్ని కాకులు వచ్చి మిరపకాయలు ఎత్తుకుపోతుంటే పెద్ద కర్ర పట్టుకొని వాటిని వెంటనే తరిమాడు. ఆ కాకులు ఎక్కడికి వెళ్తే అక్కడికి వెల్తూ వాటిని తరుముచున్నాడు. ఆ వెంట తరమడం యింకా పూర్తికాలేదు కాబోలు యింటికింకా తిరిగి రాలేదు. యిలాంటివాడు వదిలిపోవడం మంచిదే అని మేముకూడా బావని వెదకలేదు.

చక్కని కథలకు
"కథాంజలి" చదవండి